క్లుప్తంగా

రుద్రమఠంలో నేదురుమల్లి రాజ్యలక్ష్మి పూజలు


పూజలు నిర్వహిస్తున్న మాజీ మంత్రి రాజ్యలక్ష్మి

వెంకటగిరిరూరల్ : పట్టణంలోని మనులాలా పేటలో పునర్నిర్మించిన రుద్రమూర్తి మఠం ఆలయాలో మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఘనంగా ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం స్థానిక నేతలతో రాజ్యలక్ష్మి వివిధ అంశాలపై చర్చించారు.

విశేష ఆలయాల్లో ప్రత్యేక పూజలు

నాయుడుపేటటౌన్ : మండలంలోని చిగురుపాడు సమీపంలో స్వర్ణముఖి నదీ తీరం వద్ద నూతనంగా నిర్మించిన చేపట్టిన బాల సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కుంభాభిషేక వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మూలమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ క్రమంలోనే తిమ్మాజి కండ్రిగలో ఉన్న దుర్గామల్లేశ్వరిదేవి ఆలయంలో విశేష పూజలు చేశారు. అమ్మవారికి శాస్త్రోక్తంగా కుంకుమార్చన నిర్వహించారు. పట్టణంలోని వ్యూహలక్ష్మీ సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జాతరకు 35 బస్సులు

కోట : కసుపూరు ముత్యాలమ్మ జాతరకు కోట నుంచి 35 బస్సులు నడపనున్నట్లు వాకాడు ఇన్‌చార్జి డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 2 నుంచి 5వ తేదీ వరకు కసుపూరు ముత్యాలమ్మ జాతర జరగనున్న క్రమంలో భక్తుల సౌకర్యార్థం నాయుడుపేట నుంచి కోట మీదుగా కసుపూరుకు ప్రత్యేక బస్సులు నడుస్తాయని వివరించారు. ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కోట ఆర్టీసీ ప్రాంగణంలో మెరుగైన వసతులు కల్పించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీటీఎం కృష్ణమ్మ పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ఓజిలి: ఉపాధి హామీ పథకం కింద కూలీలకు రోజూ రూ.272 గిట్టుబాటు కూలి చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని పీడీ శ్రీనివాసప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం ఓజిలి గ్రామంలో ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. పీడీ మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి అదనంగా మరో రూ.28 కూలి పెంచనున్నట్లు వెల్లడించారు. నిర్దేశిత కొలతల ప్రకారం కూలీలు పని చేస్తే రూ.300 వరకు వస్తుందన్నారు. టీఏ మహేష్‌కుమార్, ఎఫ్ఏ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

దక్కిలి : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. శుక్రవారం మండలంలోని వెంకటగిరి–రాపూరు జాతీయరహదారిపై లింగసముద్రం, దక్కిలి, మోపూరురోడ్డు, సంగనపల్లె రోడ్డు తదితర ప్రాంతాల్లో ఎస్ఐ చౌడయ్య పలు వాహనాలను తనిఖీలు చేశారు.

ట్రాఫిక్‌కు అంతరాయం

చిల్లకూరు : జాతీయ రహదారిపై శుక్రవారం ప్రమాదం జరగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వివరాలు.. నాయుడుపేట వైపు వెళుతున్న కారు ముందు వెళుతున్న బస్సును ఓవర్‌టేక్ చేయబోయి వెనుకనుంచి ఢీకొంది. అదే సమయంలో వెనుక వస్తున్న ఆర్టీసీ బస్సు కారును ఢీకొంది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న ఎస్‌వీయూ వాహనం బస్సును ఢీకొట్టింది. ఎవరికీ గాయాలు కాకపోవడం విశేషం.

బార్ అసోసియేషన్‌కు కార్యవర్గం

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని బార్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం ఎన్నికైంది. శుక్రవారం ఈ మేరకు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన న్యాయవాది హరినాథ్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. అధ్యక్షుడిగా పసల గంగా ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా పోట్లాపూడి శ్రీనివాసులు, కార్యదర్శిగా గోల్ల వీరస్వామి, సహాయ కార్యదర్శిగా షేక్ రఫీ, ట్రెజరర్‌గా ఉల్లిపాయల సురేష్, సభ్యులుగా చంద్రగిరి అమర్‌నాథ్, కె.నిత్యా, అల్లపాక పరశురామయ్య, ఏర్రావందల మోహన్ కృష్ణ, ముద్దుగోటి సునీల్ ఎన్నికైనట్లు వెల్లడించారు.

అవగాహన ర్యాలీ

కోట : ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం నుంచి కోట క్రాస్ రోడ్డు వ రకు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార నాగరాజారా వు మాట్లాడుతూ ప్రజల చేతిలో ఓటే వజ్రాయుధమ న్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎంపీడీఓ శంకరయ్య, ఎస్ఐ నాగబాబు, డీటీ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

కోడి పందెంరాయుళ్ల అరెస్ట్

కోట: రుద్రవరం సమీపంలో నిర్వహిస్తున్న కోడిపందెం స్థావరాలపై శుక్రవారం పోలీసులు దాడులు చేపట్టారు. ముగ్గురిని అరెస్ట్ చేసి 3 కోళ్లు, రూ.2,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు.

పెంచలకోనలో పందిళ్లు

రాపూరు : పెంచలకోనలో చలువ పందిళ్లు, తివాచీ ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. శుక్రవారం వారు మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో భక్తులు ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.



నాయుడుపేట : బేరిపేట చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

కరుణామయం.. క్రీస్తు త్యాగం

- భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే దీక్షలు
- వాడవాడలా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- జీసస్ సందేశాలను వివరించిన పాస్టర్లు

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని బేరిపేటలోని సౌత్ ఆంధ్ర లూథరన్ చర్చిలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా పాస్టర్ ఆదర్శ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు శిలువను మోస్తూ చెప్పిన ఏడు మాటలను సంఘ పెద్దలు ధ్యానించి వాటి సారాంశాన్ని వివరించారు. అలాగే బేతెలు చర్చి పాస్టర్ శరత్ బాబు, రోమన్ కేథలిక్ చర్చి ఫాదర్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేపట్టారు.

ఓజిలి మండలంలో..

ఓజిలి: మండలంలోని కురుగొండ, ఓజిలి, ఆర్మేనిపాడు, మానమాల, పెద్దపరియ తదితర గ్రామాల్లో గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వృద్ధులకు పండ్లు పంచిపెట్టారు. కరుణామయుని త్యాగ నిరతిని స్మరించుకుంటూ క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శుక్రవారం గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని ప్రభువు కొలువైన చర్చిలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఈ సందర్భంగా జీసస్ జీవితంలో మహోన్నత ఘట్టాలను గుర్తుచేసుకున్నారు. ప్రపంచ మానవాళి పరిరక్షణకు క్రీస్తు అందించిన శాంతి సందేశాల సారాంశాన్ని పాస్టర్లు వివరించారు. యేసయ్య చూపిన బాటలో జనులందరూ ముందుకు నడవాలని సూచించారు. ప్రతి ఒక్కరితో ప్రేమ.. సోదరభావంతో మెలగాలని పిలుపునిచ్చారు. దయామయుని ఆదర్శాలను కొనసాగిస్తూ పరిశుద్ధాత్ములుగా జీవనం సాగించాలని కోరారు.

పెళ్లకూరు మండలంలో..

పెళ్లకూరు : గుడ్‌ఫ్రైడే సందర్భంగా పెళ్లకూరు, చిల్లకూరు, చెంబేడు, పెన్నేపల్లె, చావలి, పాలచ్చూరు, అనకవోలు, అక్కగారిపేట తదితర గ్రామాల్లోని క్రైస్తవ మందిరాల్లో ప్రార్థనలు చేపట్టారు. సంఘ కాపరులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాంతి, ప్రేమ, సోదరభావం పెంపొందించుకోవాలని సూచించారు.

డీవీ సత్రం మండలంలో..

దొరవారిసత్రం : శుభ శుక్రవారం సందర్భంగా డీవీ సత్రం, ఏకొల్లు, ముచ్చలగుంట, ఆనేపూడి, కుప్పారెడ్డి పాళెం, నెలబల్లి, రామారెడ్డికండ్రిగ గ్రామాల్లోని ఎస్‌పీఎల్‌సీ చర్చిలు, మందిరాల్లో విశేష ప్రార్థనలు నిర్వహించారు.

కోట మండలంలో..

కోట: స్థానిక ఎన్‌సీఆర్ నగర్‌లోని బెరాకా ఆరాధన మందిరంలో సంఘకాపరి నోవాబాబు, విద్యానగర్ హోలీ ప్రేయర్ చర్చిలో బిషప్ ప్రదీప్‌కుమార్, లూథరన్ చర్చిలో పాస్టర్ దయాకర్ తమ దివ్య సందేశాన్ని వినిపించారు. ఏసుక్రీస్తు శాంతి ప్రపంచానికి అందించిన ఏడు అమృత వాక్యాలను తెలియజేశారు. శనివారం రన్ ఫర్ జీసస్, ఆదివారం ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

వాకాడు మండలంలో..

వాకాడు : స్థానిక సెయింట్ జేమ్స్ లూథరన్ చర్చిలో క్రైస్తవులు ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు. సంఘ కాపరి ఎస్.ప్రశాంత్‌బాబు మాట్లాడుతూ నేనే మార్గం.. నేనే జీవం.. అని పాపుల కన్నీళ్లు తుడవడానికి ఏసు క్రీస్తు రక్తం చిందించిన రోజును గుడ్‌ఫ్రైడేగా జరుపుకుంటారని వివరించారు. అలాగే క్రైస్తవ సోదరులు ఉపవాస దీక్షలు చేపట్టి ప్రార్థనల్లో పాల్గొన్నారు.

చిల్లకూరు మండలంలో..

చిల్లకూరు : మండలంలోని పలు గ్రామాలలో ఉన్న లూథరన్ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏరూరులోని జాన్స్ లూథరన్ చర్చిలో బ్రదర్ విజయకుమార్ దైవ సందేశం వినిపించారు. ఆదివారం ఆయా గ్రామాలలో సమాధుల వద్ద పునరుత్థాన వేడుకలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అనంతరం క్రైస్తవులతో ఉపవాస దీక్షలను విరమింపజేశారు. ఈ మేరకు పండ్ల రసాలను పంపిణీ చేశారు.

గూడూరులో..

గూడూరురూరల్ : పట్టణం, మండలంలోని పలు చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని సౌత్ ఆంధ్ర లూథరన్ చర్చి పరిధిలోని పరిశుద్ధ పౌలు పేత లూథరన్ సంఘంలో సంఘ కాపరి డేవిడ్ ప్రశాంత్‌రాజ్ దైవ సందేశం వినిపించారు. ప్రభువును శిలువ వేసినా శాంతి సమాజం స్థాపనలకు ఆయన పునరుత్థానం పొందారని వెల్లడించారు. ఈ సందర్భంగా యువతీయువకులు ఆలపించిన గీతాలు అలరించాయి. కార్యక్రమంలో ఎల్‌సీసీ, పీసీసీ కమిటీ సభ్యులు, చైర్మన్ రాజయ్య పాల్గొన్నారు.


ప్రత్యేక ప్రార్థనలో వాకాడు సంఘు కాపరి


గూడూరు: లూథరన్ చర్చిలో వాక్య సందేశం ఇస్తున్న పాస్టర్ దేవిడ్ ప్రశాంత రాజ్


గూడూరు: ప్రార్థనలో క్రైస్తవులు


కోట: బెరాకా ఆరాధన మందిరంలో దివ్యసందేశం వినిపిస్తున్న నోవాబాబు


చిల్లకూరు : దైవ సందేశం ఇస్తున్న బ్రదర్ విజయకుమార్

కదంతొక్కిన బీసీలు


మస్తాన్‌యాదవ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి, గురుమూర్తి

వెంకటగిరి(సైదాపురం) : వెంకటగిరిలో వైఎస్సార్‌సీపీ నేత బొలిగర్ల మస్తాన్‌యాదవ్‌కు శుక్రవారం ఘన స్వాగతం పలుకుతూ బీసీలు కదంతొక్కారు. ఈ సందర్భంగా స్టాండ్ నుంచి పార్టీ శ్రేణులు, బీసీ సంఘాల నేతలు మోటార్ సైకిల్ ర్యాలీ చేపట్టారు. ముందుగా ఆయన పోలేరమ్మ ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మస్తాన్‌యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన ఎంపీ అభ్యర్థి గురుమూర్తి, ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌ని మస్తాన్‌యాదవ్ ఘనంగా సత్కరించారు. అనంతరం నేతలందరూ కలిసి ఎన్‌జేఆర్ భవన్‌కు చేరుకున్నారు. ఈ క్రమంలో నియోజకవర్గంలోని బీసీ సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. మస్తాన్‌యాదవ్ మాట్లాడుతూ రామ్‌కుమార్‌రెడ్డి, గురుమూర్తిని అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తామని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తగా ప్రతి గ్రామంలో పర్యటించి వారి విజయానికి కృషి చేస్తామన్నారు. బీసీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిచ్చారని తెలిపారు. మనసున్న మహరాజును మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క బీసీకి ఉందని పిలుపునిచ్చారు. బీసీలకు టీడీపీ తీరని ద్రోహం చేసిందని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయబావుటా ఎగురవేస్తుందని స్పష్టం చేశారు. ఈ మేరకు సమష్టిగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు కొడవలూరు ధనంజయరెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, సైదాపురం మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మన్నారపు రవికుమార్‌యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు వదబల్లి ప్రభాకర్ రెడ్డి, జయంపు పీఏసీఎస్ అధ్యక్షుడు వెందోటి కార్తీక్‌రెడ్డి, కలువాయి జెడ్పీటీసీ సభ్యుడు అనిల్ కుమార్‌రెడ్డి, నారిబోయిన శ్రీనివాసులు, నారిబోయి హరి, కలపాడు సర్పంచ్ ప్రసాద్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


వెంకటగిరిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీసీలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సంక్షేమ పాలనకు ప్రజాదరణ


ఎన్నికల ప్రచారంలో రేవంత్ చక్రవర్తి తదితరులు

గూడూరురూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పాలకు విశేషంగా ప్రజాదరణ దక్కుతోందని ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ తనయుడు రేవంత్ చక్రవర్తి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని అరుంధతీయ పాళెం, పీఎస్ఆర్ పార్క్ తదితర ప్రాంతాల్లో ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాతమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రేవంత్ మాట్లాడుతూ జగనన్న అందించిన సంక్షేమ ఫలాల కారణంగానే ఎక్కడికి వెళ్లినా జనం ఆదరిస్తున్నారన్నారు. తన తండ్రి మురళీధర్‌కు నిత్యం ప్రజల్లో ఉంటారని, వారి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తుంటారని తెలిపారు. జగనన్న దయతో ఇక్కడ గెలిచిన వ్యక్తి పార్టీకి తీరని ద్రోహం చేశారని ఆరోపించారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఎప్పుడూ దళితులను అవమానిస్తుంటారని విమర్శించారు. జగనన్న నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ అంటూ బడుగులను అక్కున చేర్చుకుంటారని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బూదరు గురవయ్య, పార్టీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు సునీల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు కృష్ణప్రసాద్‌రెడ్డి, దాసరి వెంకటేశ్వర్లు, నేతలు అన్నం మురళి, సుభాన్, రాఘవరెడ్డి, వంగపూరి పెంచలయ్య, వెంకటేష్, సతీష్, ఏడుకొండలు, రాజశేఖర్, జలీల్, బాబు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా సమష్టి కృషి


విజయసాయిరెడ్డితో ఎన్‌డీసీసీబీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి తదితరులు

నాయుడుపేటటౌన్ / పెళ్లకూరు : సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా సమష్టిగా కృషి చేయనున్నట్లు ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం నెల్లూరులో వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డిని మర్యాదపూర్వకంగా ఆయన కలిశారు. ముందుగా పార్టీ నేతలు కామిరెడ్డి రాజారెడ్డి, చిల్లకూరు శ్రీనివాసులురెడ్డి, నాయుడుపేట ఏఎంసీ వైస్ చైర్మన్ బాలసుబ్రమణ్యంతో కలిసి విజయసాయిరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేట నియోజవర్గ పరిధిలో నిర్మిస్తున్న జాతీయ రహదారుల పనుల కారణంగా పలు గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. హైవే నిర్మాణానికి సేకరించిన భూములకు కేంద్రప్రభుత్వం నుంచి నిర్వాసితులకు పరిహారం ఇప్పించాలన్నారు. తిరుపతి ఎంపీ అభ్యర్థి గురుమూర్తి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కిలివేటి సంజీవయ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు స్వచ్ఛందంగా వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో ప్రణాళికాబద్ధంగా ఎన్నికల ప్రచారం చేపట్టాలని విజయసాయిరెడ్డి సూచించినట్లు నాయకులు వివరించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు


మాట్లాడుతున్న తహశీల్దార్ సాంబశివరావు, ఎంపీడీఓ నీలకంఠేశ్వరరెడ్డి

వెంకటగిరిరూరల్ : తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎంపీడీఓ నీలకంఠేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో నీటి ఇక్కట్లు తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పనిచేయని బోర్లు, మోటార్లకు తక్షణమే మరమ్మతుల చేయించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు అధికారులు కమిటీలుగా ఏర్పడి నీటి ఇబ్బందులను అరికట్టేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. తహశీల్దార్ సాంబశివరావు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఓటు హక్కులను అందరూ సద్వినియోగం చేసుకునేలా గ్రామీణులకు అవగాహన కల్పించాలని సూచించారు. పోలింగ్ బూత్‌లను పకడ్బందీగా సిద్ధం చేయించాలని ఆదేశించారు.

వైఎస్సార్‌సీపీ నేతకు నివాళి


నివాళులర్పిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్ : మండలంలోని పారవోలు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత తోట ఆనంద్ శుక్రవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి వెంటనే పారవోలుకు వెళ్లి ఆనంద్ మృతదేహానికి పూలమాల వేసి నివాళిలర్పించారు. మృతుడి కుటుంబీకులను పరామర్శించి, అండగా ఉంటామని భరోసా కల్పించారు.

నేడు వ్యాపారులతో ఆత్మీయ సమావేశం

సూళ్లూరుపేట : పట్టణంలోని వ్యాపారులతో శనివారం సాయంత్రం 7 గంటలకు ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ చిన్ని సత్యనారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ముఖ్య అతిథిగా పాల్గొననున్నట్లు వెల్లడించారు. పట్టణంలోని వర్తక, వాణిజ్య సంఘాల సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

ఇబ్బంది లేకుండా రేషన్ పంపిణీ

కోట : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ రేషన్ సరుకుల పంపిణీకి ఎలాంటి ఇబ్బంది ఉండదని తహసీల్దార్ నాగరాజారావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎండీయూ ఆపరేటర్లు 1 నుంచి 17వ తేదీ వరకు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం సరుకులను కార్డుదారుల ఇంటి వద్దనే పంపిణీ చేస్తారన్నారు. రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు ఎన్నికల కోడ్ పరిధిలోకి వస్తారని, ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉండాలని ఆదేశించారు. అలాగే ఓటర్లను ప్రభావితం చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణుల ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న నేతలు

నాయుడుపేటటౌన్ : వైఎస్సార్‌సీపీ సూళ్లూరుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కిలివేటి సంజీవయ్య, తిరుపతి ఎంపీ అభ్యర్థి గురుమూర్తిని ఆశీర్వదించి గెలిపించాలంటూ పార్టీ శ్రేణులు ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయంటూ వివరిస్తున్నారు. కార్యక్రమంలో గంధవల్లి సిద్ధయ్య, ముప్పాళ్ల భరత్, బూత్ కన్వీనర్ ధనుంజయ పాల్గొన్నారు.

వైభవంగా తులసీ పూజ


పూజలో పాల్గొన్న భక్తులు

గూడూరురూరల్ : పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత అళఘనాథస్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక లక్ష తులసీ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా దేవదేవేరులను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి ఏకాంత సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ శశాంక్ కుమార్ పాల్గొన్నారు.

గణపతికి చందనాభిషేకం

గూడూరురూరల్ : పట్టణంలోని తూర్పువీధిలో స్వయంభువుగా వెలసిన పురాతన శ్రీహరిద్రాగణపతి ఆలయంలో శుక్రవారం సంకట హర చతుర్థి సందర్భంగా స్వామి వారికి చందనాభిషేకం నిర్వహించారు. అనంతరం మూలమూర్తిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పెద్దసంఖ్యలో భక్తులు మహిమాన్విత వినాయక స్వామిని సేవించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ముస్లింల అభ్యున్నతే లక్ష్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట రూరల్ : ముస్లింల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమించారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. శుక్రవారం పట్టణంలోని అక్బరియా మసీదులో ముస్లింలు ఇచ్చిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. ముస్లింలకు డిప్యూటీ సీఎంతోపాటు అనే ఎమ్మెల్యే పదవులు కట్టబెట్టింది జగనన్న మాత్రమే అని వెల్లడించారు. మసీదులో షాదీఖానాపై భవన నిర్మాణం, మన్నారుపోలూరులోని ఈద్గాకు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ చిన్ని సత్యనారాయణ, అలవల సురేష్, అయితా శ్రీధర్, బాబురెడ్డి, చిలకా యుగంధర్, కృపాకర్‌రెడ్డి, ఎంఏ మాలిక్, ఎస్‌కే హుస్సేన్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి రూ.30 లక్షల అంబులెన్స్ వితరణ



డీఎంహెచ్‌ఓ శ్రీహరికి అంబులెన్స్ తాళం అందిస్తున్న ప్లాంట్ డైరెక్టర్ అమిత్ జైన్

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీలోని క్యాడ్‌బరీ డైరీమిల్క్, ఓరియో, బోర్న్‌విటా వంటి దిగ్గజ బ్రాండ్ల తయారీ పరిశ్రమ మోండెలెజ్ ఇం – డియా కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా శుక్రవారం సూళ్లూరుపేట కమ్యూనిటీ ప్రభుత్వ ఆస్పత్రికి రూ. 30లక్షలు విలువైన అధునాతన వసతులు కలిగిన నూతన అంబులెన్స్‌ను వితరణగా అందజేసింది. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డీఎం అండ్‌హెచ్‌ఓ) కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ శ్రీహరికి మోండెలెజ్ ప్లాంట్ డైరెక్టర్ అమిత్ జైన్ అధికారికంగా అంబులెన్స్ తాళాలను అందజేశారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత చర్యల ద్వారా ఈ ప్రాంతంలో ఆరోగ్య సంరక్షణ సదుపాయాలను బలోపేతం చేయడంలో తమ కంపెనీ నిబద్ధతను ఇది ధృవీకరిస్తుందంటూ ఈ సందర్భంగా అమిత్ జైన్ పేర్కొన్నారు. మోండెలెజ్ ఇండియాకు శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో మోండెలెజ్ ఇండియా చొరవను అభినందించారు. మోండెలెజ్‌కు చెందిన పలువురు ఉన్నతాధికారులు, శ్రీసిటీ జనరల్ మేనేజర్ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.